# పంట సాగు పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**భూపాలపల్లి ప్రతినిధి, జూన్ 19(నినాదం):** పంట సాగు పట్ల రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్స్ లో వ్యవసాయ శాఖ ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళా కార్యక్రమంలో ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రైతుల ఆర్థికాభివృద్ధికి 21వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసినట్లు స్పష్టం చేశారు. రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో సమృద్ధిగా అందిస్తున్నామని తెలిపారు. రైతులు పంట మార్పిడి ద్వారా అధిక ఆదాయం పొందే విధం గా పంటల సాగు చేపట్టాలని సూచిం చారు. మక్కలు, అపరాలు, వాణిజ్య పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలని తెలిపారు. ఇట్టి పంటలకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం యొక్క ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ రైతుల యొక్క సంక్షేమానికి ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతు ఆరుకాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పంటలు సాగుపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సన్న బియ్యానికి 14 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలి పారు. జిల్లాలో 1.19 లక్షల మెట్రిక్ టన్నులు మక్కలు దిగుమతి వచ్చినప్ప టికీ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసామన్నారు. రైతులను మభ్య పెట్టే మిల్లర్లు, వ్యాపారులపై చర్యలు తీసు కుంటామని అవసరమైతే మిల్లు లను సీజ్ చేస్తామని తెలిపారు. ట్యాబ్ ఎంట్రీ, ట్రక్ షీట్ సకాలంలో జారీ చేయకపోవడం వల్ల రైతులకు కొంత ఇబ్బంది కలిగిందని భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకుండా చూస్తామని తెలిపారు. ఎల్ నినో వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కిసాన్ మేళాలో పంటల సాగులో శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతులకు వ్యవసాయంలో ఆధునిక సాంకేత పరిజ్ఞానం అందు బాటులో ఉన్నదని వాటన్నిటిని వినియోగించుకోవాలని సూచించారు. భూసారన్ని బట్టి పంటలు సాగు చేయాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణ శాఖ సూచన ప్రకారం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రత్యాన్మయ పంటలు సాగకు రైతుల మొగ్గు చూపాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏఏ పంటలు సాగు చేయాలో వ్యవసాయ శాఖ ద్వారా ప్రణాళిక తయారు చేశారని ఆ ప్రణాళిక ప్రకారం రైతులు పంటలు సాగు చేపట్టాలని తెలిపారు. పంటల వైవిధ్యం వల్ల భూసారం పెరుగుతుందని వ్యవసాయ సాంకేతిక శాస్త్రవేత్తలు యొక్క సలహాలు సూచనలు పాటించాలని సూచించారు. యూరియా రైతువేదికలలో విక్రయిస్తున్నామని పటిష్ట పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. యూరియా కొరకు రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన స్టాళ్లు రైతులు పరిశీలించి యంత్రాలు, ఆధునిక పద్ధతులు విత్తనాలు తదితర వ్యవసాయ అంశాలపై రైతులు సమగ్రమైన అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి బాబూరావు, సహకార అధికారి వాలియా నాయక్, పశు సంవర్ధక అధికారి డా కుమార స్వామి, ఉద్యాన అధికారి తిరుపతి, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్ అప్పం కిషన్, సింగిల్ విండో చైర్మన్లు తిరుపతి రెడ్డి, కుమార్ యాదవ్, సంపత్, నర్సింగ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్లు కిష్టన్న, పంతగాని తిరుమల, గుమ్మడి శ్రీదేవి వ్యవసాయ అధికారులు, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్తలు తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ ఫోక్ సింగర్ నాగదుర్గకు హీరోయిన్ ఛాన్స్

N NADAM CINEMA



'కాపోళ్ల ఇంటికాడా', 'పేరుగల్ల పెద్దిరెడ్డి', 'దారి పొంటొతుండు' వంటి విలక్షణమైన జానపద గీతాలతో, తన అద్భుతమైన నృత్యంతో యూట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వ్యూస్ సొంతం చేసుకున్న ప్రముఖ ఫోక్ సింగర్, డాన్సర్ నాగదుర్గ టాలీవుడ్‌లో బంపర్ ఆఫర్ కొట్టేసింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తన మార్కు జానపద నృత్యాలతో సెన్సేషన్ సృష్టించిన ఈ తెలంగాణ జానపద కళాకారిణి, ఇప్పుడు ఏకంగా సిల్వర్ స్క్రీన్ పై హీరోయిన్‌గా అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. ప్రముఖ క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కి చెందిన 'సుకుమార్ రైటింగ్స్' మరియు సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ కి చెందిన 'బన్నీ వాస్ ప్రొడక్షన్స్' సంయుక్తంగా నిర్మిస్తున్న ఒక క్రేజీ ప్రాజెక్టులో నాగదుర్గకు హీరోయిన్‌గా లక్కీ ఛాన్స్ దక్కింది. ఈ సినిమాలో హీరోగా వైవిధ్యమైన పాత్రలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి నటించబోతున్నాడు. ఈ సినిమాతో వంశీ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇప్పటికే 'కలివి వనం' అనే ఓ విలక్షణమైన చిత్రంలో నటించిన నాగదుర్గ, ఆ తర్వాత తమిళంలోనూ ఓ క్రేజీ ప్రాజెక్ట్ లో నటించింది. ఇప్పుడు టాలీవుడ్ లోని మోస్ట్ సక్సెస్‌ఫుల్ బ్యానర్ల నిర్మాణంలో, ప్రియదర్శి సరసన లీడ్ రోల్ పొంది ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. నాగదుర్గ పల్లెటూరి నైపథ్యం, ఆమె సహజ సిద్ధమైన నటన, హావభావాలు ఈ చిత్రానికి ప్రధాన బలం కానున్నాయని తెలుస్తోంది. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కబోతున్నట్లు సమాచారం.

# సొంత స్థలంలో విద్యుత్ స్తంభాలు!..

## యజమాని ఆవేదన!



**కోదాడ, జూన్19 (నినాదం):** అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామంలోని పాత ఎస్సీ కాలనీలో తన సొంత ఇంటి స్థలంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో ఇల్లు నిర్మించుకోలేకపోతున్నానని దేవపం గు కాశి ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి వాటికి ఎలాంటి విద్యుత్ తీగలు కూడా వేయలే దని తెలిపారు. ఈ విషయమై పలు మార్లు అధికారులను కలిసి స్తంభాలను తొలగించాలని కోరినా స్పందన లేద న్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా నని వాపోయారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయిస్తానని హెచ్చరించారు.




# బాలకృష్ణ మూవీలో కాజల్ అగర్వాల్

## ఫస్ట్ లుక్ విడుదల చేసిన మూవీ మేకర్స్

నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కు తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఎన్‌డికె111' నుంచి మేకర్స్ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. శుక్రవారం హీరోయిన్ కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ చిత్రంలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో గత కొన్ని వారాలుగా ఈ ప్రాజెక్ట్‌పై నెలకొన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది. తాజాగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కాజల్ సింపుల్ చీరకట్టులో, కళ్లజోడు ధరించి అత్యంత గంభీరంగా కనిపించింది. కార్యాలయ వాతావరణంలో నిలబడి ఉన్న ఆమె లుక్‌లో సీరియస్‌నెస్, పవర్‌ఫుల్ వైబ్ స్పష్టంగా కనిపిస్తోంది. స్టార్ హీరోయిన్‌ను ఇలా డీ-గ్లామర్ లుక్‌లో చూపించడంతో పాత్రపై క్యూరియాసిటీ ఒక్కసారిగా పెరిగింది. పోస్టర్‌తో పాటు చిత్ర బృందం కాజల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ సినిమా ఆమె కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది.





# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి




**గద్వాల బ్యూరో జూన్ 19( నినాదం) :** ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా సమగ్రంగా రూపొందించేందుకు చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై శుక్రవారం హైదరాబాద్ నుంచి ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్ ఓ, బిఎల్ ఏ లకు ఈనెల 24 లోగా శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఈ నెల 25వ తేదీ నుంచి బిఎల్ఓ లు తమ పోలీస్ స్టేషన్ ల పరిధిలోని ఓటర్ల ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలన్నారు. అక్టోబర్ 1వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటించే వరకు షెడ్యూల్ ప్రకారం ఆయా కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కలిగేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశామని, వారికి మ్యాపింగ్ చేయబడని డేటాను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, ఎన్నికల విభాగం అధికారి మంజుల, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం


## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




**రామచంద్రాపురం, జూన్19 (నినాదం):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తెల్లాపూర్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర భవన మరియు ఇతర నిర్మాణ రంగాల కార్మికుల సంఘం తెల్లాపూర్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని.. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ రంగ కార్మికుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం కోసం అతి త్వరలో స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ తగు ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ తరపున ప్రతి కార్మికుడు గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, శ్రీశైలం, దయాకర్, శ్రీ పాల్ రెడ్డి, నాగరాజు, సాగర్, హర్ష, ఇంద్రారెడ్డి, సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ చికిత్సలకు అన్ని రకాల చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయి

## సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ వైద్యులు సుమంత్ కుమార్




**నిజామాబాద్ ప్రతినిధి,జూన్19(నినాదం) :** ప్రస్తుతం క్యాన్సర్ రోగులకు అనేక రకాల క్యాన్సర్ చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయని , అత్యాధునిక టెక్నాలజీ అందుబా టులోకి వచ్చిందని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి ప్రముఖ వైద్యులు సుమంత్ కుమార్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని యశోద మెడికల్ సెంటర్ లో సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ఆన్కాలజిస్ట్, హెమటాలజీ ప్రముఖ వైద్య నిపుణులు సుమంత్ కుమార్ మల్లుపట్టు క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. క్యాన్సర్ చికిత్స విధానాలు అందరికీ ఒకే విధంగా అవసరం ఉండదని వైద్యులు వెల్లడించారు. ప్రతి వ్యక్తి పరిస్థితిని బట్టి చికిత్స నిర్ణయించబడుతుం దన్నారు. చికిత్స ముఖ్య ఉద్దేశాలు క్యాన్సర్‌ను పూర్తిగా నియంత్రించడం లేదా తగ్గించడం, రోగి జీవిత నాణ్యత (క్వాలిటీ అఫ్ లైఫ్ ) మెరుగుపరచడం, చికిత్స వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ తగ్గించడం, అవసరమైన చికిత్సను తగ్గించకుండా, సైడ్ ఎఫెక్ట్స్ ను మినిమైజ్ చేయడం, ఆధునిక టెక్నాలజీ ప్రయోజనాలని అన్నారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో హైలీ అడ్వాన్స్, కొత్త టెక్నాలజీ రేడియేషన్ మెషిన్ హైపర్ సైట్ ఉపయోగిస్తున్నారని అన్నారు. ఈ కొత్త పద్ధతుల వల్ల ట్రీట్మెంట్ మరింత క్యాన్సర్ రోగులకు ప్రయోజనం కలిగిస్తోందని సుమంత్ కుమార్ స్పష్టం చేశారు. రేడియేషన్ ట్రీట్మెంట్ ప్రత్యేకతలు క్యాన్సర్ ఉన్న భాగాన్ని మాత్రమే టార్గెట్ చేసి చికిత్స చేయడం వలన చుట్టూ ఉన్న మామూలు కణజాలానికి నష్టం తక్కువగా ఉంటుందని ప్రముఖ వైద్యులు స్పష్టం చేశారు . చికిత్స చాలా ఖచ్చితంగా ప్రేసిషన్ గా ఇవ్వబడుతుందని అన్నారు. యశోద మెడికల్ సెంటర్ నిజామాబాద్ లో ప్రతి నెల మూడవ శుక్రవారం తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆహార అలవాట్ల వల్లే క్యాన్సర్ వ్యాధులు సంభవిస్తున్నాయని ఆయన అన్నారు. మద్యం సేవించడం, పొగాకు తో పాటు కాలుష్యం వల్ల, వంశపారంపర్యంగా క్యాన్సర్ సోకుతుందన్నారు. దీనిని ప్రాథమిక దశలోనే గుర్తించే విధంగా యశోద ఆసుపత్రిలో ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ మేనేజర్, మార్కెటింగ్ మేనేజర్ శ్రీరామ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)Published at 6-3-439, kisannagar, Karimnagar-505001 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787